సాక్షి
నిజామాబాద్
సోమవారం । 29 । జనవరి । 2024



వరికి తెగుళ్ల బెడద

యాసంగిలో సాగు చేస్తున్న వరి పంటను తెగుళ్లు ఆశిస్తున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

- 10లో ▸



మోడల్ స్కూల్ పిలుస్తోంది

మోడల్ స్కూళ్లలో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదలయ్యింది. 22వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
31.1 /12.7

వాతావరణం

ఉదయం శీతలగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

లక్ష్యానికి చేరువలో..



ముప్కాల్‌లో సమావేశమైన మహిళా సంఘ సభ్యులు

- 90 శాతం మించిన బ్యాంకు లింకేజీ రుణాలు
- మహిళా సంఘాలకు రూ. 932.74కోట్లు పంపిణీ
- ఏడు మండలాల్లో పూర్తయిన టార్గెట్

డొంకేశ్వర్(ఆర్మూర్)/బాల్కొండ: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించడానికి బ్యాంకుల ద్వారా అందిస్తున్న రుణాల పంపిణీ జిల్లాలో లక్ష్యం దిశగా సాగుతోంది. కష్టతరం అనుకున్న బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యం సులువుగా మారింది. మరో రెండు నెలలు గడువు ఉండగానే మహిళా సంఘాలకు 90 శాతానికి పైగా రుణాలు అందించారు. జిల్లాలో ఏడు మండలాలు లక్ష్యానికి మించి మహిళా సంఘాలకు రుణాలు అందించగా, డిచ్‌పల్లి మండలం మొదటి స్థానంలో ఉంది. మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.1,032కోట్లకు పైగా రుణాలివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం టార్గెట్ విధించింది. అయితే గుదిబండలాగా మారిన కొండంత లక్ష్యాన్ని చేధించడం కష్టసాధ్యమని సెర్ప్ ఉద్యోగులు తొలుత భావించారు. కానీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విడతల వారీగా మహిళా సంఘాలకు విరివిగా రుణాలు అందిస్తూ వచ్చారు. ఈ ఏడాది మార్చి నాటికి ఆయా మండలాలకు కేటాయించిన టార్గెట్‌ను పూర్తి చేయాల్సి ఉండగా, ఇప్పటికే పలు మండలాలు వంద శాతానికి మించి రుణాలు అందించాయి. మిగతా కొన్ని మండలాలు లక్ష్యానికి చేరువలో ఉన్నాయి.

సిరికొండ లాస్ట్..

మొత్తం రూ.1,032కోట్ల రుణాలను 18,905 మహిళా సంఘాలకు అందించాలని లక్ష్యం ఉంది. ఇప్పటి వరకు రూ.932.74 కోట్ల (90.32శాతం) రుణాలను 13,717 సంఘాలకు అందించారు. అయితే మహిళా సంఘాలకు అవసరం లేకున్నా కూడా బలవంతంగా రుణాలు అంటగట్టారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. బ్యాంకులో పాత రుణాలు తీరకముందే కొత్త రుణాలు అందించడంతో పేద మహిళలకు నెలవారి వాయిదా చెల్లించడం కష్టంగా మారింది. డిచ్‌పల్లి మండలం రూ.60 కోట్లకు పైగా (109.12శాతం) రుణాలు అందించి టాప్‌లో ఉండగా, మోస్రా రెండు, ముప్కాల్ మూడు, ఆర్మూర్ నాలుగు, నవీపేట్ ఐదో స్థానాల్లో ఉన్నాయి. సిరికొండ మండలం కేవలం 71.69 శాతం రుణాలు అందించి చివరిస్థానంలో ఉంది. ధర్పల్లి, వర్ని, మోర్తాడ్, ఇందల్వాయి మండలాలు సైతం వెనుకబడి ఉన్నాయి. మార్చి మొదటి వారంలోగా నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి ఆదేశాలున్నాయి.

సీసీఎల్ పద్ధతిలో..

సీసీఎల్ పద్ధతిలో రుణాలు అందించడంతో లక్ష్యం సులువుగా పూర్తవుతుంది. ఈ పద్ధతి ప్రకారం ఓ మహిళా సంఘం గతేడాది తీసుకున్న అప్పును రెగ్యులర్‌గా చెల్లిస్తుంటే మిగిలి ఉన్న అప్పును కొత్త అప్పులో తీసివేసి మళ్లీ రుణాలను అందించవచ్చు. ఇలా జిల్లాలోని మహిళా సంఘాలకు రుణాలు అందిస్తున్నారు. దీంతో అధికారులు రుణ లక్ష్యాన్ని చేరుకుంటున్నారు.

బాల్కొండ మండలంలో రూ.25 కోట్ల లక్ష్యం ఇవ్వగా ఇప్పటికే రూ.22 కోట్ల వరకు రుణాలు అందించారు. ముప్కాల్ మండలంలో రూ.16.28 కోట్లకు రూ.15.5 కోట్లు, మెండోరా మండలంలో రూ.20.72 కోట్లకు రూ.19.69 కోట్లు అందించారు.

లక్ష్యానికి మించి రుణాలిస్తాం

సెర్ప్ శాఖ ఇచ్చిన లక్ష్యాన్ని ఏ మాత్రం భారంగా భావించకుండా మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తున్నాం. ఇప్పటికే 90 శాతానికి మించి రుణాలు ఇచ్చాం. మార్చి నాటికి లక్ష్యానికి మించి రుణాలు అందజేసి రాష్ట్ర స్థాయిలో మంచి స్థానాన్ని పొందుతాం. వెనుకబడిన మండలాలు తమ టార్గెట్‌ను పూర్తి చేయాల్సిందే.

– చందర్‌నాయక్, డీఆర్‌డీవో

సీఐ ప్రేమ్‌కుమార్ అరెస్ట్

- మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడిని తప్పించిన కేసులో..
- అదుపులోకి తీసుకున్న పంజాగుట్ట పోలీసులు



ఖలీల్‌వాడి: బోధన్ మాజీ ఎమ్మెల్యే కుమారుడిని తప్పించిన కేసులో బోధన్ ఎస్‌హెచ్‌వోగా పనిచేసిన బీడీ ప్రేమ్‌కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. షకీల్ కుమారుడు రాహిల్ కొన్ని రోజు ల క్రితం మద్యం మత్తులో కారు డ్రైవ్ చేస్తూ హైదరాబాద్‌లోని ప్రగతిభవన్ వద్ద బారికేడ్లను ఢీకొట్టిన విషయం తెలిసిందే. ఈ కేసులో రాహిల్ తప్పించుకోవడానికి బోధన్ ఎస్‌హెచ్‌వోగా పనిచేసిన ప్రేమ్‌కుమార్ ప్రధాన కారణమని పోలీసులు గుర్తించారు. బోధన్ ఎస్‌హెచ్‌వో ప్రేమ్‌కుమార్, పంజాగుట్ట ఎస్‌హెచ్‌వో దుర్గారావు ఒకే బ్యాచ్‌కు చెందిన వారు కావడంతో ఇద్దరు కలిసి కేసును పక్కదోవ పట్టించారనే ఆరోపణలు ఉన్నాయి. రాహిల్ దుబాయి పారిపోవడంలో ఎస్‌హెచ్‌వోలు దుర్గారావు, బీడీ ప్రేమ్‌కుమార్‌ల పాత్ర ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసును తప్పుదోవ పట్టించారని ఎస్‌హెచ్‌వో దుర్గారావును గతంలోనే సస్పెండ్ చేశారు. అప్పటి నుంచి ఆయన పరారీలో ఉన్నారు. కేసులో సీఐ బీడీ ప్రేమ్‌కుమార్ ప్రధానంగా వ్యవహరించినట్లు గుర్తించి ఆదివారం అరెస్ట్ చేశారు. మాజీ ఎమ్మెల్యే షకీల్‌కు అనుకూలంగా వ్యవహరించిన ప్రేమ్‌కుమార్ అరెస్ట్ పోలీస్ శాఖలో చర్చనీయాంశంగా మారింది.

షకీల్ ఓటమి తర్వాత సెలవులో..

శాసనసభ ఎన్నికల్లో షకీల్ ఓటమి పాలైన తర్వాత బోధన్ ఎస్‌హెచ్‌వో ప్రేమ్‌కుమార్ వ్యక్తిగత సెలవుపై వెళ్లారు. దీంతో సీసీఆర్‌బీలో ఉన్న సీఐ వీరయ్యకు బోధన్ ఎస్‌హెచ్‌వోగా సీపీ కల్మేశ్వర్ తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. సెలవులో వెళ్లిన సమయంలో మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రాహిల్ ఘటన జరగడంతో ప్రేమ్‌కుమార్ తన బ్యాచ్‌మెట్ పంజాగుట్ట ఎస్‌హెచ్‌వో దుర్గారావుకు చెప్పి కేసును పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిని విచారించిన పోలీసులు ప్రేమ్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు.

బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా..

బోధన్ ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహించిన సమయంలో ప్రేమ్‌కుమార్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌కు అనుకూలంగా ఉన్నారనే ప్రచారం ఉంది. గతంలో పట్టణంలో పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే షకీల్‌ను నిధులు కేటాయించాలని అడిగిన ఎంఐఎం కౌన్సిలర్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఎన్నికల సమయంలో పట్టణంలో శాంతిభద్రతలు చూడాల్సిన ఎస్‌హెచ్‌వో ఎడపల్లిలో కాంగ్రెస్, బీజేపీ నేతలపై లాఠీఛార్జీ చేశారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో పనులు కావాలంటే షకీల్ కనుసన్నల్లోనే పని చేశారనే ఆరోపణలు ఉన్నాయి. మాజీ ఎమ్మెల్యే షకీల్‌తో ఉన్న సంబంధాల కారణంగానే రాహిల్ కేసును పక్కదారి పట్టించారని చర్చ జరుగుతోంది.

శనివారం పోస్టింగ్.. ఆదివారం అరెస్ట్

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సీఐల బదిలీలు శనివారం జరిగాయి. బోధన్ ఎస్‌హెచ్‌వో బీడీ ప్రేమ్‌కుమార్ సీసీఎస్–3కి బదిలీ అయ్యారు. బదిలీ జరిగి 24 గంటలు కాకుండానే అరెస్ట్ కావడంతో పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది. షకీల్ ఓటమి తర్వాత ఎస్‌హెచ్‌వో ప్రేమ్‌కుమార్ బదిలీ కోసం ప్రయత్నాలు చేశారు. మాజీ ఎమ్మెల్యేకు సన్నిహితుడిగా ఉండటంతో లూప్ లైన్ పోస్టింగ్ ఇచ్చినట్లు పోలీసు వర్గాలలో చర్చ జరుగుతోంది.

రేషన్‌కార్డుల ఈ-కేవైసీ గడువు పొడిగింపు

మోర్తాడ్: రేషన్‌కార్డుల ఈ–కేవైసీ గడువును ప్రభుత్వం పొడిగించింది. లబ్ధిదారులు ఫిబ్రవరి నెలాఖరు వరకు కేవైసీ చేయించుకోవచ్చని పౌరసరఫరాల శాఖ స్పష్టం చేసింది. జిల్లాలో ఇప్పటి వరకు 76.18 శాతం ఈకేవైసీ పూర్తయింది. జిల్లాలో బీపీఎల్ కార్డుల సంఖ్య 4,02,052 ఉండగా, లబ్ధిదారులు 12,83,499 మంది ఉన్నారు. ఇప్పటి వరకు 9,77,828 మంది ఈకేవైసీ పూర్తి చేసుకున్నారు. ఈకేవైసీ పూర్తి చేయించుకోకపోతే రేషన్ బియ్యం పంపిణీ నిలిచిపోతుందని ప్రభుత్వం గతంలోనే వెల్లడించింది. ఈ కేవైసీ కోసం రేషన్ దుకాణాల వద్ద వినియోగదారులు రద్దీ పెరగడంతో ప్రభుత్వం గడువు పెంచినట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చంద్రప్రకాశ్ వెల్లడించారు.

అసంపూర్తి పనులు పూర్తి చేయించండి

- ఇంజినీర్లకు పంచాయతీరాజ్ శాఖ ఆదేశం

మోర్తాడ్: సర్పంచ్‌ల పదవీ కాలం ఫిబ్రవరి ఒకటితో ముగిసిపోనున్న నేపథ్యంలో ఆయా గ్రామ పంచాయతీల్లో అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే పూర్తి చేయించాలని ఇంజినీర్లను పంచాయతీరాజ్ శాఖ ఆదేశించింది. గ్రామాల్లో ఈ నెలలో మొదలై పూర్తి కాని పనులు ఏమైనా ఉంటే వాటిని వెంటనే గుర్తించి ఈ నెలాఖరులోగా పూర్తి చేయించాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్రం, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. చివరి విడతగా గత ఆగస్టులో జనరల్ ఫండ్‌గా జిల్లాలోని అన్ని పంచాయతీలకు కలిపి రూ.14,02,21,159 నిధులు విడుదలయ్యాయి. ఎస్సీ ప్రత్యేక గ్రాంటు కింద రూ.2,49,08,481 నిధులు, ఎస్టీ సబ్ ప్లాన్ కింద రూ.1,15,16,179 నిధులు జమ చేశారు. ఎస్‌ఎఫ్‌సీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం సరిగా విడుదల చేయలేదు. గ్రామ పంచాయతీలకు ఇంటి పన్నుల ద్వారా రూ.20 కోట్ల వరకు ఆదాయం సమకూరింది. అన్ని రకాల నిధులతో పంచాయతీలలో చేపట్టిన పనుల్లో ఏమైనా అసంపూర్తిగా ఉంటే వాటిని వీలైనంత తొందరగానే పూర్తి చేయించాల్సి ఉంది. ఇప్పటికే అనేక పనులు పూర్తి కాగా బిల్లుల చెల్లింపు జరగాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయతీ ఖాతాల్లో జమ చేయడంతో ఈ నిధుల వినియోగానికి ఎలాంటి ఇబ్బందులు లేవు. పన్నుల ఆదాయం, ఎస్‌ఎఫ్‌సీ నిధులను ట్రెజరీ ద్వారానే వినియోగించాల్సి రావడం, గత ప్రభుత్వం ఆనాలోచిత నిర్ణయాలతో నిధులను వినియోగించే వీలు లేకుండా పోయింది. బిల్లులు చేతికి అందక సర్పంచ్‌లు అనేక అవస్థలు పడుతున్నారు. బిల్లుల చెల్లింపుల పరిస్థితి ఎలా ఉన్నా ప్రత్యేకాధికారుల పాలన మొదలు కాక ముందే పనులు పూర్తి కావాలని పంచాయతీ రాజ్ శాఖ ఆదేశించడం విశేషం.

పనులు పూర్తి చేయిస్తున్నాం

గ్రామ పంచాయతీల్లో మిగిలి ఉన్న పనులను వెంటనే పూర్తి చేయించడానికి చర్యలు తీసుకుంటున్నాం. సర్పంచ్‌ల పదవి కాలం ముగిసిపోక ముందే పనులు పూర్తి చేయించాలని సూచించాం. పనులు అసంపూర్తిగా ఉంటే బిల్లుల చెల్లింపు సాధ్యం కాదు. అన్ని పనులు చివరి దశకు చేరుకున్నాయి.

– విక్రమ్, పంచాయతీరాజ్ ఏఈ, మోర్తాడ్

ఎన్‌ఆర్‌ఐ పాలసీ దిశగా అడుగులు!

- యూఏఈలో పర్యటించిన టీపీసీసీ ఎన్‌ఆర్‌ఐ సెల్ ప్రతినిధులు
- కార్మికుల అభిప్రాయాల సేకరణ
- త్వరలో ముఖ్యమంత్రికి నివేదిక అందిస్తామన్న సభ్యులు



గల్ఫ్ కార్మిక సంఘాల ప్రతినిధులతో కలిసి నో యువర్ రైట్స్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బృందం సభ్యులు

మోర్తాడ్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడానికి కసరత్తు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. త్వరలోనే ప్రవాసీ విధానం(ఎన్‌ఆర్‌ఐ పాలసీ) రూపొందించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్‌ఆర్‌ఐ పాలసీ, గల్ఫ్ సంక్షేమ బోర్డుల రూపకల్పన ఎలా ఉండాలి అన్న విషయాలపై అధ్యయనం చేసేందుకు గల్ఫ్ కార్మికుల సంఘాల నాయకులు, టీపీసీసీ ఎన్‌ఆర్‌ఐ సెల్ ప్రతినిధుల బృందం శని, ఆదివారాలలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో పర్యటించింది. ప్రవాసీ మిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల, జగిత్యాల జిల్లా సారంగపూర్ జెడ్పీటీసీ సభ్యుడు, గల్ఫ్ రిటర్నీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, టీపీసీసీ ఎన్‌ఆర్‌ఐ సెల్ చైర్మన్, మాజీ రాయబారి బీఎం వినోద్ కుమార్, ఇమిగ్రంట్స్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షుడు మంద భీంరెడ్డి, టీపీసీసీ కార్యదర్శి జెలాల సైదయ్య బాబు, ఎన్‌ఆర్‌ఐ సెల్ కన్వీనర్ సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి అధ్యయన బృందంలో సభ్యులుగా ఉన్నారు. దుబాయ్, షార్జా, అబుదాబీలలోని కార్మికుల క్యాంపులలో బస చేసిన బృంద సభ్యులు.. అక్కడి కార్మికుల మనోగతం తెలుసుకున్నారు. ఏళ్లుగా కుటుంబాలకు దూరంగా ఉంటూ పరాయి దేశంలో పనిచేస్తున్న వారి జీవన విధానంలో ఎలాంటి మార్పులు కావాలి, సొంతూరిలోనే ఉపాధి కల్పిస్తే అక్కడే పని చేసుకుంటారా, ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అవసరం అన్న అంశాలపై చర్చించారు. గల్ఫ్‌లో ఉన్న కార్మికులు సొంతూళ్లకు చేరుకున్న తరువాత పునరావాసం, పునరేకీకరణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి, ప్రభుత్వానికి సూచించాల్సిన అంశాలు ఏమిటనే విషయాలపై రెండు రోజులపాటు అధ్యయనం చేశామని బృంద సభ్యుడు, గల్ఫ్ వ్యవహారాల విశ్లేషకుడు మంద భీంరెడ్డి 'సాక్షి'తో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకునే ఆలోచనలో ఉందని, ఎన్‌ఆర్‌ఐ పాలసీ రూపకల్పనలో ప్రభుత్వానికి తమవంతు సహాయం అందించే దిశగా ఈ పర్యటన సాగిందని పేర్కొన్నారు. కార్మికుల అభిప్రాయాలను ఒక నివేదిక రూపంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రి శ్రీధర్ బాబులకు అందజేస్తామని పేర్కొన్నారు.

పక్కాగా డీజిల్ లెక్క

- చెత్త సేకరణ వాహనాలకు ఆన్‌లైన్ బిల్లులు తప్పనిసరి
- వాహనాల నంబర్లు, రీడింగ్ పరిశీలన
- ప్రత్యేక దృష్టిసారించిన కార్పొరేషన్ కమిషనర్



'సాక్షి'లో ప్రచురితమైన కథనాలు

నిజామాబాద్‌నాగారం: నగరంలో చెత్త సేకరణ, చెత్త తరలింపునకు ఉపయోగించే వాహనాల్లో డీజిల్ కొట్టించడంలో చేతివాటం ప్రదర్శిస్తున్న వారిపై కార్పొరేషన్ కమిషనర్ మంద మకరందు సీరియస్‌గా దృష్టి సారించారు. నగరంలో మొత్తం ఆరు జోన్లు ఉండగా, శానిటేషన్ విభాగం పరిధిలో సుమారు 130 వరకు వాహనాలు ఉన్నాయి. ఈ వాహనాల్లో కొట్టించే డీజిల్ లెక్కలు పక్కాగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. గతంలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా చిత్రామిశ్రా ఉన్న కాలంలో 'సాక్షి'లో 'డీజిల్ తాగేస్తున్నారు' శీర్షికన కథనం ప్రచురితం కాగా, ఆమె విచారణకు ఆదేశించారు. దీంతో ఆ ఒక్క నెలలోనే రూ.10లక్షల మేర ఆదా అయినట్లు అధికారులు వెల్లడించారు.

ప్రత్యేక దృష్టి

డీజిల్ అక్రమాలపై కార్పొరేషన్ కమిషనర్ మంద మకరందు మరింత సీరియస్‌గా దృష్టి సారించారు. ఆన్‌లైన్ బిల్లులతోపాటు వాహనాల నంబర్లు, రీడింగ్‌ను పరిశీలించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. పెట్రోల్ బంకుల్లో ఆన్‌లైన్‌బిల్లులు, వాహనాల నంబర్లు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. మీటర్ రీడింగ్ సైతం పరిశీలించనున్నారు. ఒక్కో వాహనంలో ఎన్ని లీటర్ల డీజిల్ వాడుతున్నారు, ఆ వాహనం ఎన్ని కిలోమీటర్లు తిరుగుతోంది అని తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

నూతన కమిషనర్ రాగానే..

ఇన్‌చార్జి కమిషనర్ స్థానంలో గతేడాది జూలైలో పూర్తిస్థాయి కమిషనర్‌గా మంద మకరందు బాధ్యతలు స్వీకరించారు. కొత్త కమిషనర్ రావడంతో కొందరు డీజిల్ వాడకంలో చేతివాటం ప్రదర్శించారు. శానిటేషన్‌కు సంబంధించి ఇన్‌చార్జి అధికారులు నేరుగా డ్రైవర్లతో చేతులు కలిపి అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. డీజిల్‌లో చేతివాటంపై మళ్లీ 'సాక్షి'లో కథనాలు ప్రచురితం కావడంతో కమిషనర్ ప్రాథమిక విచారణ చేపట్టగా, రూ.2లక్షల వరకు ఆదా అయినట్లు అధికారులు తెలిపారు. తూతూ మంత్రంగా బిల్లులు సమర్పించి ప్రతి నెలా కమీషన్లు తీసుకొని అక్రమాలకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది.

పూర్తి వివరాలు సేకరిస్తాం

డీజిల్ లెక్కలు ఇక నుంచి మరింత పక్కాగా ఉంటాయి. ఆన్‌లైన్ బిల్లులతోపాటు మీటర్ రీడింగ్, వాహనాల నంబర్లు తదితర పూర్తి వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలని కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు. దీనికి అనుగుణంగా ముందుకు వెళ్లడం జరుగుతుంది.

– సాజిద్ అలీ, ఇన్‌చార్జి ఎంహెచ్‌వో

భారతీయ సంస్కృతిని కాపాడుదాం



సమ్మేళనానికి హాజరైన మహిళలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రొఫెసర్ త్రివేణి

నిజామాబాద్ సిటీ/నిజామాబాద్‌రూరల్: భారతీయ సంస్కృతిని కాపాడుకోవాలని తెలంగాణ యూనివర్సిటీ ప్రొఫెసర్ వంగరి త్రివేణి అన్నారు. ఆదివారం నగర శివారు మాధవనగర్ బీఎల్‌ఎన్ గార్డెన్‌లో మహిళా శక్తి సమ్మేళనం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు రెండు వేలమంది మహిళలు పాల్గొన్నారు. ప్రారంభ సమావేశాన్ని ప్రొఫెసర్ త్రివేణి, జిల్లా కో ఆపరేటివ్ సెంట్రల్‌బ్యాంక్ జనరల్ మేనేజర్ అనుపమ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రొఫెసర్ త్రివేణి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, విలువల గురించి వివరించారు. సేవికా సమితి రాష్ట్ర నాయకురాలు రూప మాట్లాడుతూ.. ఎక్కడ మహిళలు పూజించబడతారో అక్కడ దేవతలు ఉంటారన్నారు. డాక్టర్ శిషారాఘవేందర్, విశాఖపట్నంకు చెందిన సామాజిక కార్యకర్త లింగం ఉజ్వల మాట్లాడారు. మహిళల్లో చైతన్యం కలిగించటం ద్వారా భారతీయ సంస్కృతి, కుటుంబ విలువలను పరిరక్షించవచ్చన్నా రు. జిల్లా సంయోజిత అహల్య, సుమలత, నీలవే ణి, కృష్ణవేణి, ఆరాధన, రాజేశ్వరి, శుభాదేశ్ పాండే, సరళా మహేందర్ రెడ్డి, భానుశ్రీ, శమంత, మౌనికారెడ్డి, అలా సూరాష్, మేఘా సుబేదార్ బోడె, డాక్టర్ హేమ చక్రపాణి, కాట్రగడ్డ భారతి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పోటీకి భయపడుతున్న బీఆర్‌ఎస్



నిజామాబాద్ రూరల్: లోక్‌సభ ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి పోటీ చేయడానికి బీఆర్‌ఎస్ పార్టీ భయపడుతుందని నిర్మల్ ఎమ్మెల్యే, బీజేపీ నిజామాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన ఎంపీ అర్వింద్‌తో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి ఎంపీ అభ్యర్థులు లేరని, అరువు తెచ్చుకునే పరిస్థితి నెలకొందన్నారు. కల్వకుంట్ల కవితకు నిజామాబాద్ నుంచి పోటీ చేయడానికి భయం పట్టుకుందన్నారు. ఎంపీ అర్వింద్ పసుపు బోర్డు తీసుకొచ్చి మాట నిలబెట్టుకున్నారని గుర్తు చేశారు. నిజామాబాద్ ఎంపీ స్థానాన్ని మళ్లీ గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు ప్రగతి నగర్ మున్నూరుకాపు సంఘంలో నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమీక్ష నిర్వహించారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, జిల్లా అధ్యక్షుడు దినేష్‌పటేల్ కులచారి, పల్లె గంగారెడ్డి, మోరెపల్లి సత్యనారాయణ, గద్దె భూమన్న, పెద్దోళ్ల గంగారెడ్డి, లోక భూపతిరెడ్డి, వెంకట్ రమణి, కల్లెం బాల్‌రెడ్డి, బద్దం లింగారెడ్డి, అల్జాపూర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రెంజల్ విండో చైర్మన్ ఎన్నికపై ఉత్కంఠ

రెంజల్: పదవీకాలం ఒప్పందం రాజకీయ ఉత్కంఠకు తెరలేపింది. రెంజల్ విండో చైర్మన్ పదవీ బాధ్యతల ప్రక్రియ అంతా 'ఒప్పందం' ప్రకారమే జరుగుతుందనుకున్న బీఆర్‌ఎస్‌ను కాంగ్రెస్ అడ్డుకునే ప్రయత్నాలు చేస్తోంది. గతంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్‌కు చెందిన రెంజల్, బోర్గాం గ్రామాల డైరెక్టర్లు చైర్మన్ పదవి కోసం పోటీపడ్డారు. చివరకు చెరో రెండున్నర ఏళ్లు ఒప్పందం చేసుకున్నారు. ముందుగా చైర్మన్‌గా ఎన్నికైన ప్రశాంత్ ఒప్పందం ప్రకారం రాజీనామా చేయడంతో వైస్ చైర్మన్ మొహినొద్దీన్‌కు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. అయితే ప్రస్తుతం చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ రావడంతో విండో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. ఈ నెల 30వ తేదీన చైర్మన్ ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. విండోలో బీఆర్‌ఎస్‌కు మెజార్టీ డైరెక్టర్లు ఉండగా, ప్రస్తుత ఇన్‌చార్జి చైర్మన్ మొహినొద్దీన్ వారితో కలిసి ఈనెల 26న విహారయాత్రకు వెళ్లారు.

కాంగ్రెస్ ప్రయత్నాలు ఫలించేనా?

చైర్మన్ ఎన్నిక ప్రక్రియను వాయిదా వేయించేందుకు కాంగ్రెస్ నాయకులు పావులు కదుపుతున్నారు. విండో పరిధిలోని రెంజల్‌కు చెందిన ఓ డైరెక్టర్ అనారోగ్యంతో మృతిచెందగా, తాడ్‌బిలోలికి చెందిన డైరెక్టర్ రాజీనామా చేశారు. ఖాళీగా ఉన్న రెండు డైరెక్టర్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించిన తరువాతే చైర్మన్‌ను ఎన్నుకోవాలని కాంగ్రెస్ నాయకులు ప్రయత్నిస్తున్నారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ విజేత నిజామాబాద్



కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లిలోని ఇండోర్ స్టేడియంలో కమ్మర్‌పల్లి బ్యాడ్మింటన్ అసోసియేషన్ (కేబీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో డబుల్స్ ఓపెన్ కేటగిరిలో నిజామాబాద్‌కు చెందిన రాఘవ, అర్షద్ జోడీ విజేతగా నిలిచింది. 40 ప్లస్ ఏజ్ డబుల్స్ కేటగిరిలో కమ్మర్‌పల్లికి చెందిన కిషన్, మోహన్‌రెడ్డి జోడీ విజేతగా నిలిచింది. 67 జట్లు పాల్గొన్న ఈ టోర్నీ శనివారం అర్ధరాత్రి ముగిసింది. డబుల్స్ ఓపెన్‌లో రన్నర్‌గా కిషన్, మోహన్‌రెడ్డి (కమ్మర్‌పల్లి), , 40 ప్లస్ ఏజ్ కేటగిరిలో రన్నర్‌గా డాక్టర్ నవీన్, సాయి జోడీ(హైదరాబాద్) నిలిచారు. విజేతలకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి బహుమతులు అందజేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుంకెట రవి, తిప్పిరెడ్డి శ్రీను, నిమ్మ రాజేంద్రప్రసాద్, బుచ్చి మల్లయ్య, కేబీఏ అధ్యక్షుడు అహ్మద్ పాల్గొన్నారు.

'ట్రాఫిక్ రూల్స్ పాటించాలి'

కామారెడ్డి రూరల్: ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని కామారెడ్డి ఏఎంవీఐ విక్రమ్ సూచించారు. రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా ఆదివారం పాతరాజంపేట శివారులోని రైల్వే గేటు వద్ద ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. అజాగ్రత్తగా వాహనాలను నడపడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయన్నారు. కుటుంబ బాధ్యతలను గుర్తెరిగి జాగ్రత్తగా మెలగాలన్నారు. మద్యం తాగి వాహనాలను నడుపొద్దన్నారు.

క్లుప్తంగా

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడిపై కేసు నమోదు

ఇందల్వాయి: బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చెలివెరి దాసుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ధర్పల్లి మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి గతంలో గౌరారం గ్రామానికి చెందిన ఓ మహిళను తన్నిన వీడియోతో పాటు ఎన్నికల ముందు అతనికి సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కండువ కప్పుతున్న ఫొటోని జోడించి మహిళను తన్నిన వ్యక్తికి కండువ కప్పుతున్న రేవంత్‌రెడ్డి అన్న అని వ్యాఖ్యాన్ని జోడించి సోషల్ మీడియాలో దాసు పోస్ట్ చేశారు. దీంతో ఆగ్రహించిన గోపి దాసుపై ఫిర్యాదు చేశారు. గతంలో సమిసిపోయిన సమస్యను మళ్లి తెర మీదకు తెచ్చి మండలంలో రెండు వర్గాల మధ్య అల్లర్లు సృష్టించడమే కాకుండా, తన ప్రతిష్ఠకు భంగం కలిగించే ప్రయత్నం చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దాసుపై పలు సెక్షన్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జాతీయ కరాటేలో ప్రతిభ



బోధన్ : ఇంటర్నేషనల్ హుయాన్-చింగ్ నింజాస్ ఇండియా ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మూడో జాతీయస్థాయి కుంగ్‌ఫూ, కరాటే ఓపెన్ చాంపియన్ షిప్ పోటీలో బోధన్‌కు చెందిన నలుగురు విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారు. స్పారింగ్, కటాస్ విభాగాల్లో అక్షయ, చార్విక్ రోడే, అతిథి, ఆకాష్ గోల్డ్ మెడల్ సాధించారని కరాటే మాస్టర్ అశోక్ రోడే తెలిపారు.

నియామకం



బోధన్ : రాష్ట్ర బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శిగా పట్టణ కేంద్రానికి చెందిన మఠపతి శివకుమార్ నియామకమయ్యారు. శనివారం నిజామాబాద్ నగర కేంద్రంలో జరిగిన వేదిక రాష్ట్ర ప్రతినిధుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు పాండు యాదవ్ చేతుల మీదుగా నియమాక పత్రాన్ని అందుకున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : ఉమ్మడి సదాశివనగర్ మండలంలోని మర్కల్ మల్లన్నగుట్ట వద్ద ఆదివారం గాయత్రి బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాలోజ్యుల శ్రీనివాస శర్మ, ఉపాధ్యక్షుడిగా ప్రశాంత్‌కుమార్ శర్మ, ప్రధానకార్యదర్శిగా రాజేశ్వర్ రావు, కోషాధికారిగా సతీశ్ శర్మ, మహిళ కన్వీనర్‌గా నెమలి సమతలను ఎన్నుకున్నారు. 20వ వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఏప్రిల్ 5, 6, 7వ తేదీల్లో గాయత్రి పునఃశ్చరణ, లలిత సహస్ర నామ పారాయణ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు.

మోడల్ స్కూల్ పిలుస్తోంది

- ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- ఫిబ్రవరి 22వరకు ఆన్‌లైన్ ప్రక్రియ
- ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష



కొత్తాబాదిలోని ఆదర్శ పాఠశాల

బాన్సువాడ రూరల్: ఆదర్శ పాఠశాలల్లో విద్యాబోధన ఉత్తమంగా ఉండడంతో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి కనబరుస్తుంటారు. ఆంగ్ల మాధ్యమంలో చదవాలనుకునే గ్రామీణ విద్యార్థులకు ఈ ఆదర్శ పాఠశాలలు వరంగా మారుతున్నాయి. రూ. వేలు ఖర్చు పెట్టి, దూర ప్రాంతాల్లో ఉన్న కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదివించాలంటే గ్రామీణ పేద, మధ్యతరగతి తల్లిదండ్రులకు ఆర్థికంగా భారంగా ఉండేది. బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించేందుకు ప్రభుత్వం 2013లో ఆదర్శ పాఠశాలలను ప్రారంభించింది. ఈ స్కూళ్లలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 6 నుంచి 10వ తరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది.

జిల్లాలో ఆరు ఆదర్శ పాఠశాలలు..

కామారెడ్డి జిల్లాలో ఆరు ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. బాన్సువాడ (కొత్తాబాది), సదాశివనగర్, నాగిరెడ్డిపేట్, ఎల్లారెడ్డి, నిజాంసాగర్, మద్నూర్(మేనూర్)లో ఉన్న ఈ ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతిలో 600 వందల మంది విద్యార్థులకు ప్రవేశం ఉంటుంది. దీంతో పాటు 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 2023-24 విద్యాసంవత్సరంలో ప్రవేశం పొంది మధ్యలో వివిధ కారణాలతో మానేసిన పరిమిత సంఖ్యలో ఉండే ఖాళీసీట్ల ప్రవేశానికి అవకాశం ఉంటుంది. ప్రవేశాలు రోస్టర్ పద్ధతిన నిర్వహిస్తారు. ఎస్సీ విద్యార్థులకు 15శాతం, ఎస్టీలకు 6శాతం, బీసీ విద్యార్థులకు 29శాతం ఉంటాయి. బీసీ విభాగంలో బీసీ ఏ-7, బీసీ బీ-10, బీసీ సీ-1, బీసీ డీ-7, బీసీ ఈ-4తో పాటు ఓపెన్ కేటగిరిలో 50శాతం సీట్లను భర్తీ చేస్తారు. అన్ని కేటగిరిల్లోనూ బాలికలకు 33శాతం, దివ్యాంగులకు 3శాతం సీట్లు కేటాయించనున్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు..

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలు పొందేందుకు http//telanganams.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థి ఆధార్‌కార్డు, బోనాఫైడ్, పాస్‌పోర్టు సైజ్ ఫోటోతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని. ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రతితో పాటు కుల ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డు, బోనాఫైడ్ జిరాక్సు ప్రతులను సంబంధిత పాఠశాల ప్రిన్సిపాల్‌కు అందజేయాలి.

పరీక్ష విధానం ఇలా..

దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. అన్ని మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. మొత్తం 100 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కోప్రశ్నకు ఒకమార్కు. 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో 5వ తరగతి సిలబస్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. తెలుగు, గణితం, సైన్స్, సోషల్, ఆంగ్ల మాధ్యమ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు

ఆదర్శపాఠశాలల్లో విద్యనభ్యసించేందుకు ఖాళీల భర్తీకి ఫిబ్రవరి 22 లోగా దరఖాస్తు చేసుకోవాలి. జనరల్ కేటగిరి విద్యార్థులు రూ.200, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగులు, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రూ.125 చెల్లించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష ఉంటుంది.

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

ఆదర్శ పాఠశాలల్లో సీట్ల భర్తీలో స్థానిక మండలం విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుంది. 6వ తరగతిలో పూర్తిసీట్లు, 7నుంచి 10వ తరగతి వరకు పరిమిత సంఖ్యలో మిగులు సీట్లకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతుంది. ఆసక్తి, అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. ఏదైనా సందేహాలు ఉంటే పాఠశాలలో సంప్రదించాలి. ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా చేపడతాం.

– ఫకీరయ్య, ప్రిన్సిపాల్, కొత్తాబాది టీఎంఎస్

పాఠశాలల ప్రత్యేకతలు..

- 6 నుంచి 10 తరగతి వరకు ఎలాంటి రుసుము లేకుండా ఉచిత బోధన
- ఆంగ్లమాధ్యమంలో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో చక్కని బోధన
- పక్కా భవనంతో కూడిన విశాలమైన తరగతి గదులు
- 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వమే ఉచితంగా పాఠ్యపుస్తకాలు, రాతపుస్తకాలు, యూనిఫాంల అందజేత
- సైన్స్, కంప్యూటర్ ల్యాబ్, ప్రొజెక్టర్ రూంలతో పాటు లైబ్రరీ సదుపాయం
- నాణ్యమైన భోజనం, పౌష్టికాహారం అందజేత
- 8వ తరగతి విద్యార్థులకు జాతీయ ఉపకార వేతనాలు పొందేందుకు ప్రత్యేక శిక్షణ
- 10వ తరగతి విద్యార్థులకు నేషనల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్(ఎన్‌టీఎస్ఏ)కు ప్రత్యేక శిక్షణ తరగతులు, నీట్, ఐఐటీ పరీక్షలకు సంసిద్ధులను చేయడం.
- ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యం.

చిల్లర రాజకీయాలు మానుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ గద్దె భూమయ్య

డిచ్‌పల్లి: రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి చిల్లర రాజకీయాలు మానుకోవాలని లేదంటే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని డిచ్‌పల్లి ఎంపీపీ గద్దె భూమయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీపీ నివాసగృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తారనే విశ్వాసంతో ప్రజలు మిమ్మల్ని ఎన్నుకుంటే అభివృద్ధిని మరిచి అధికార బలంతో బలహీనవర్గాల నాయకులను అగణదొక్కాలని, అవిశ్వాసాలను ప్రోత్సహించడం తగదని విమర్శించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ఓటమి చెంది కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇటీవలే మండల బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు కొందరు కాంగ్రెస్‌లో చేరారని తెలిపారు. రూరల్ ఎమ్మెల్యే ప్రోత్సాహంతో ఈ నెల 12న తనపై అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చారన్నారు. ఈక్రమంలో ఈ నెల 29న అవిశ్వాస సమావేశం నిర్వహించేందుకు నిజామాబాద్ ఆర్డీవో ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. తాను ఈ విషయమై హైకోర్టును ఆశ్రయించగా సమావేశాన్ని నిర్వహించరాదని కోర్టు స్టేఆర్డర్ ఇచ్చిందని ఎంపీపీ తెలిపారు. తాను ఇప్పటి వరకు ఎలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడలేదన్నారు. సమావేశంలో సర్పంచ్ శివారెడ్డి, ఎంపీటీసీ ఎంబడి సంతోషం, బీజేపీ నాయకులు పానుగంటి సంతోష్‌రెడ్డి, చౌకి లక్ష్మన్, ప్రతాప్, బాలయ్య, చరణ్, చౌకి విష్ణు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

లోన్ పేరిట బురిడీ

- రూ. లక్షల్లో వసూలు
- అనంతరం డబ్బులివ్వకుండా ముప్పతిప్పలు పెడుతున్న మహిళలు

ఎడపల్లి(బోధన్) : లోన్ పేరిట అమాయకులను బురిడీ కొట్టిస్తున్న ఎడపల్లి మండలం జాన్కంపేట గ్రామానికి చెందిన మాయలేడీల ముఠా బండారం బయటపడింది. వివరాల్లోకి వెళ్తే.. ఎడపల్లి మండలంలోని జాన్కంపేటకు చెందిన మహిళల ముఠా ఈనెల 22న భైంసా మండలంలోని కంచోలి గ్రామంలో ముందుగా రూ. 25 వేలు చెల్లిస్తే రూ. లక్ష బ్యాంక్ లోన్ ఇప్పిస్తామని బురిడీ కొట్టించి నలుగురి వద్ద రూ. 25 వేలు చొప్పున వసూలు చేశారు. మరొకరి వద్ద రూ. 14 వేలు వసూలు చేశారు. వడ్డీలు వసూలు చేశాక ఇక్కడే ఉండాలని లోన్ డబ్బులు తీసుకొస్తామని చెప్పి అక్కడినుంచి ఉడాయించారు. ఎంతకీ వారు తిరిగి రాకపోగా మాయలేడీలకు ఫోన్‌చేస్తే స్విచ్ఛాఫ్ రావడంతో తాము మోసపోయినట్లు గ్రహించిన గ్రామస్తులు పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం.

అయితే ఈ మోసాన్ని బయటపెట్టాలనే ఉద్దేశంతో జానకంపేట్‌లో ఉంటున్న మాయలేడీల వద్దకు బాధితుల బంధువులు మరోసారి వెళ్లారు. తమకు రూ. 5లక్షలు కావాలని సదరు బాధిత బంధువులు అడగగా తమకు ముందుగానే వడ్డీ రూ. 1.25 లక్షలు చెల్లిస్తే రూ. 5 లక్షలు బ్యాంక్ లోన్ ఇప్పిస్తామని మాయలేడీలు పేర్కొన్నారు. కార్‌లో డబ్బులున్నాయని తీసుకొస్తామని చెప్పి బయట కొచ్చి బాధితుల బంధువులు పోలీసులకు సమాచారం అందించినట్లు సమాచారం. పోలీసులు మాయలేడీల వద్దకు వెళ్లి విచారించినట్లు తెలిసింది. బాధితుల డబ్బులను పదిరోజుల్లోగా తిరిగి చెల్లిస్తామని మాయలేడీలు ఒప్పుకోగా బాధితులు వెనుదిరిగారు. అమాయకుల అవసరాలను ఆసరాగా చేసుకుని మాయలేడీలు ఇలా చాలామందిని బురిడీ కొట్టించి తర్వాత డబ్బులివ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు సమాచారం. అయితే పోలీసులను విచారించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

రోడ్డుపైనే బస్సులు.. ప్రయాణికులకు తిప్పలు



బస్సు కోసం రోడ్డుపైనే నిరీక్షిస్తున్న ప్రయాణికులు



బస్టాండ్‌లోకి వెళ్లే దారిలో ఏర్పడిన గుంత

- అధ్వానంగా మారిన బస్టాండ్‌తో ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

నాగిరెడ్డిపేట: మండల కేంద్రంలోని గోపాల్‌పేట ఆర్టీసీ బస్టాండ్ అధ్వానంగా మారింది. బస్టాండ్‌లోకి వెళ్లే మార్గంలో అధిక గుంతలు ఏర్పడడంతో బస్సులు బస్టాండ్‌లోకి వెళ్లడం లేదు.

దీంతో డ్రైవర్లు రోడ్డుపైనే బస్సులను నిలుపుతుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఇబ్బందికరంగా గుంతను మూసివేసినా మరోచోట పెద్ద గుంత ఏర్పడడంతో బస్సులు బస్టాండ్‌లోకి వెళ్లలేకపోతున్నాయి. దీంతో ప్రయాణికులు బస్సుల కోసం అధిక సంఖ్యలో రోడ్డుపైనే నిలిచిఉండడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. అటు వాహనదారులు, ఇటు ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి బస్టాండ్ ఆవరణలో నెలకొన్న గుంతలను పూడ్చి వేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గుర్తుకొస్తున్నాయి..



కోటగిరిలో పాల్గొన్న ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



మహ్మద్‌నగర్‌లో..



ఉత్తునూర్ ఉన్నత పాఠశాలలో..



శెట్పల్లిసంగారెడ్డి ఉన్నత పాఠశాలలో..



మెంట్రాజ్‌పల్లిలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

డిచ్‌పల్లి/రుద్రూర్/నిజాంసాగర్/సదాశివనగర్/లింగంపేట: డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లిలోని జెడ్పీ హైస్కూల్ లో 1995-96 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. కోటగిరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2009-10 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మహ్మద్‌నగర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-2005 విద్యా సంవత్సరం పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సదాశివనగర్ మండలంలోని ఉత్తునూర్ పాఠశాలలో 2007-08 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. లింగంపేట మండలంలోని శెట్పల్లి లింగారెడ్డి ఉన్నత పాఠశాలకు చెందిన 1992-93 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. సమ్మేళనాల్లో విద్యార్థులు నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం నాటి గురువులను ఘనంగా సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

అక్కకు తలకొరివి పెట్టిన చెల్లి



మాచారెడ్డి : వారిద్దరు అక్కాచెల్లెళ్లు.. ఇద్దరికీ పిల్లలు లేరు.. అనారోగ్యం కారణంగా శనివారం అక్క మృతి చెందితే చెల్లి దహన సంస్కారాలు నిర్వహించిన హృదయ విదారక సంఘటన ఆదివారం అక్కాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వడ్ల బుచ్చి రాజయ్యకు ఇద్దరు భార్యలు వారిద్దరూ తోబుట్టువులు. పదేళ్ల కిందట అనారోగ్యంతో బుచ్చి రాజయ్య మృతి చెందడంతో అక్కాచెల్లెలు తలో పని చేసుకొని జీవనం సాగిస్తున్నారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న అక్క నర్సవ్వ (50) మృతి చెందింది. ఇద్దరికీ సంతానం లేకపోవడంతో చెల్లెలు బాల్ లక్ష్మి అక్కకు తల కొరివి పెట్టింది. ఈ హృదయ విదారక సంఘటనను చూసిన గ్రామస్తులు కంటతడి పెట్టారు.

బాన్సువాడ సీఐ బదిలీ

బాన్సువాడ: బాన్సువాడ సీఐ మహేందర్‌రెడ్డి బదిలీ అయ్యారు. పట్టణ సీఐగా విధులు నిర్వహించిన మహేందర్‌రెడ్డి గజ్వేల్ రూరల్ పీఎస్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో గతంలో పిట్లం ఎస్సైగా పని చేసిన వెంకన్న పదోన్నతిపై బాన్సువాడకు రానున్నట్లు సమాచారం.

క్రైం కార్నర్

మత్తుమందు చల్లి బంగారం అపహరణ



బాన్సువాడ: పట్టణంలోని జెండాగల్లీలో ఆదివారం ఓ వ్యాపారి కళ్లలో మత్తు మందు చల్లి 12 తులాల బంగారాన్ని అపహరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని శివదుర్గ బంగారం దుకాణానికి బంగారం కొనుగోలు చేస్తానని ఓ వ్యక్తి వచ్చాడు. దుకాణ నిర్వాహకుడు నాగులగామ విఠల్‌ను బంగారం కావాలని నమ్మించి మాటల్లో దించాడు. విఠల్ కళ్లలో మత్తు పౌడర్ చల్లడంతో యజమాని స్పృహ కోల్పోయాడు. 10 నిమిషాల తర్వాత స్పృహలోకి రావడంతో దుకాణంలో ఉన్న 12 తులాల బంగారం చోరీకి గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

దుకాణ సముదాయాలు స్వాధీనం



మాచారెడ్డి: మండలంలోని గజ్యానాయక్ తండా చౌరస్తాలోని శ్రీ వీరహన్మాన్, వేంకటేశ్వర ఆలయ దుకాణ సముదాయాలను ఆదివారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆలయ స్థలంలో పలువురు నేతలు గదులు నిర్మించుకొని తమ స్వార్థానికి వాడుకుంటున్నారని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ ఈనెల 11న దుకాణాలను ఖాళీ చేయాలని 15రోజుల పాటు గడువిచ్చారు. ఈ రోజుతో గడువు ముగియడంతో 20 దుకాణా సముదాయ గదులకు సీల్ వేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభు, జూనియర్ అసిస్టెంట్లు సురేందర్, లక్ష్మణ్,సంతోష్ ఉన్నారు.

అదృశ్యమైన వ్యక్తి హత్య



మాక్లూర్: మండలంలో అదృశ్యమైన ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అడవి మామిడిపల్లికి చెందిన మేకల కాపరి మైసయ్య (72) ఈ నెల 25న మేకలు కాసేందుకు అటవీ ప్రాంతానికి వెళ్లి అదృశ్యమయ్యాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. ఆదివారం సాయంత్రం మామిడిపల్లి శివారులోని అటవీ ప్రాంతంలో మైసయ్య మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి శరీరంపై గాయాలు, రక్తపు మరకలు ఉండడంతో ఇది హత్యే అని నిర్ధారణకు వచ్చారు. విషయం తెలుసుకున్న ఏసీపీ కిరణ్‌కుమార్, నార్త్ జోన్ సీఐ సతీశ్ మాక్లూర్ ఎస్సై సుధీర్‌రావుతో కలిసి పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, నలుగురు కుమారులు ఉన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



దుర్గయ్య (ఫైల్)

దోమకొండ: అప్పుల బాధతో ఓ రైతు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ముత్యంపేటలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై మురళి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొబ్బిలి దుర్గయ్య(53) పొలం పనులు చేస్తుంటాడు. తన మూడెకరాల పంట సాగుకోసం మూడు బోరు వేయించగా అవి విఫలమయ్యాయి. దీంతో పంటల సాగు కష్టంతో పాటు చేసిన అప్పులు రూ. నాలుగు లక్షల్లో కావడంతో జీవితంపై విరక్తితో తన వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య శోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

పాలవ్యాన్, కారు ఢీ

- ముగ్గురికి గాయాలు



ఘటన స్థలంలో వాహనాలు

వేల్పూర్: పాలవ్యాన్, కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలైన ఘటన మండలంలోని లక్కోరలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై వినయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మూర్ నుంచి వేల్పూర్ వెళ్తున్న కారు, ఆర్మూర్ వైపు వెళ్తున్న పాలవ్యాన్ లక్కోర సమీపంలోని ఇరుకు వంతెన వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో పాలవ్యాన్ అదుపుతప్పి బోల్తాపడింది. వ్యాన్‌లో ఉన్న డ్రైవర్ సత్యనారాయణ, అతని కుమారుడు సంకేత్, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. వీరిని స్థానికులు అంబులెన్స్‌లో ఆర్మూర్ ఆస్పత్రికి తరలించారు. కొద్దిసేపు ట్రాఫిక్ నిలిచిపోవడంతో క్రమబద్ధీకరించినట్లు ఎస్సై తెలిపారు.

మొరం ట్రాక్టర్ల పట్టివేత



ఇందల్వాయి: మండలంలోని ఎల్లారెడ్డిపల్లెలో అక్రమంగా మొరం తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లు, జేసీబీని పట్టుకొని తహసీల్దార్‌కు అప్పగించినట్లు ఎస్సై మహేశ్ ఆదివారం తెలిపారు. గ్రామ శివారులోని గుట్ట నుంచి మొరం తవ్వుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసినట్లు చెప్పారు. దాడిలో వాహనాలను సీజ్ చేసి డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరైనా మొరం, ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

11 మందిపై కేసు నమోదు

ఖలీల్‌వాడి: నగరంలోని బోర్గాం(పి)కి చెందిన 11 మంది మోటాడిరెడ్డి కుల సంఘ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. ఓ పంచాయితీ విషయమై సంఘ సభ్యుడు గంగారెడ్డిపై ఈ నెల 11న సంఘ సభ్యులు జరిమానాతో పాటు క్షమాపణ చెప్పాలని నిర్ణయించారు. దీంతో జరిమానా చెల్లించిన బాధితుడు క్షమాపణ చెప్పకపోవడంతో సంఘ సభ్యులు 11 మంది ఈ నెల 23న కుల బహిష్కరణ చేశారు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కుల బహిష్కరణ చేసిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వాహనాల తనిఖీ

తాడ్వాయి: మండల కేంద్రంలోని కామారెడ్డి-ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టినట్లు ఎస్సై ఆంజనేయులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా లైసెన్స్‌లు, పొల్యూషన్ లేని వాహనదారులకు జరిమానా విధించినట్లు చెప్పారు. ఎస్సై వెంట కానిస్టేబుళ్లు, హోంగార్డులు ఉన్నారు.

రైలు ఢీకొని ఒకరి మృతి



కామారెడ్డి క్రైం: కాలకృత్యాలకు వెళ్లి పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన కామారెడ్డి రైల్వే స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. జార్ఖండ్ రాష్ట్రంలోని సిండేఘా తాలూకా గిర్ధ గ్రామానికి చెందిన రాజకుమార్ బారిక్ (24) ఉపాధి కోసం ఏడాది క్రితం సిద్దిపేట జిల్లా వెంకటాపూర్‌లో వంట మనిషిగా పనిచేస్తున్నాడు. ఆదివారం 10.30 గంటల ప్రాంతంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు సమీపంలోని రైలు పట్టాలు దాటుతుండగా సిద్దిపేట-సికింద్రాబాద్ డెమో ప్యాసింజర్ రైలు ఢీకొని మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని రైల్వే ఎస్సై తావూనాయక్ పరిశీలించి విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్..



రుద్రూర్: మండలంలోని సులేమాన్‌నగర్‌కు చెందిన బొడికె గోవింద్ (54) గుండెపోటుతో శనివారం రాత్రి మృతి చెందాడు. బోధన్ డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా గోవింద్ పనిచేస్తున్నారు. డ్రైవర్ మృతి సమాచారం తెలుసుకున్న డిపో మేనేజర్ శ్రీనివాస్ అంత్యక్రియలకు హాజరయ్యారు. అంత్యక్రియల నిమిత్తం రూ.25వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఆలయంలో చోరీ

నిజామాబాద్ రూరల్: మోపాల్ మండలం రమేశ్ తండాలో ఉన్న సేవాలాల్ ఆలయంలో శనివారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై గంగాధర్ ఆదివారం తెలిపారు. ఆలయ తాళం పగలగొట్టి ఆలయంలో ఉన్న ఐదు గ్రాముల బంగారాన్ని దుండగులు చోరీ చేసినట్లు పేర్కొన్నారు. తండాకు చెందిన రాట్ల చందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.